డంప్ యార్డు ఏర్పాటు విరమించుకోవాలి

తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న రైతులు

హుజూరాబాద్ రూరల్, జూన్ 9: మండలంలోని సిర్సపల్లి గ్రామ శివారులో డంప్ యార్డు ఏర్పాటును విరమించుకోవాలని రైతులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ర్యాలీగా వచ్చి ఆర్డీవో రమేశ్ బాబు, తహసీల్దార్ కనకయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిర్సపల్లి గ్రామ రైతులు మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని చెత్తను ఇక్కడకు తరలించడం సబబు కాదన్నారు. డంప్ యార్డు ఏర్పాటు వల్ల తుమ్మనపల్లి, సింగాపూర్, సిర్సపల్లి, రంగాపూర్ గ్రామాలకు చెందిన రైతులు ఇబ్బందులు పడుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా డంపింగ్ యార్డు ఏర్పాటును విరమించుకోపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని రైతులు హెచ్చరించారు. కార్యక్రమంలో సిర్సపల్లి, రంగాపూర్ రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు ఘనసన్మానం

రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన క్రీడాకారులను సన్మానిస్తున్న ఎస్ఐ రాజు

రామడుగు, జూన్ 9 : ఈ నెల 4 నుంచి ఆరో తేదీ వరకు నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో జరిగిన 47వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలురు హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ 2025లో రామడుగు మండలానికి చెందిన ఏడుగురు క్రీడాకారులు పాల్గొని, ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా సోమవారం రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన క్రీడాకారులను పోలీస్‌స్టేషన్‌కు ఆహ్వానించిన ఎస్ఐ రాజు శిక్షకులు మూల వెంకటేశ్, మేనేజర్ శ్రీకాంత్‌తో పాటు క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ జిల్లా సంయుక్త కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, పీఈటీలు శ్రీకాంత్, సాయికృష్ణ, అమర్, శివాజీరాజు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మెప్పు కోసమే బీఆర్ఎస్‌పై విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అంజయ్య

చిగురుమామిడి, జూన్ 9: మంత్రి మెప్పు కోసం రాజకీయంగా జన్మనిచ్చిన బీఆర్ఎస్ పార్టీని మాజీ జడ్పీటీసీ రవీందర్ విమర్శించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య దుయ్యబట్టారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులకు న్యాయం చేయాలని ధర్నా చేపట్టిన బీఆర్ఎస్‌ను చిన్నాచితక పార్టీలు అంటూ విమర్శించడం సరైంది కాదన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్లి పబ్బం గడపడం ఆయనకే సాటిఅన్నారు. ప్రజా సంక్షేమ కోసం పాటుపడిన బీఆర్ఎస్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సెల్ మండలాధ్యక్షుడు అనుమాండ్ల సత్యనారాయణ, రైతు సమన్వయ సమితి మాజీ మండలాధ్యక్షుడు పెనుకుల తిరుపతి, మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, మాజీ సర్పంచ్ సన్నీల్ల వెంకటేశం, గ్రామాధ్యక్షులు కత్తుల రమేశ్, పిల్లి వేణు, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

చొప్పదండి, జూన్ 9: తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో కేసుల పరిష్కారానికి ఈనెల 14 వరకు ప్రతి రోజూ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ నరేశ్ రెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారంతో అప్పీలు లేని తీర్పును పొంది సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చని తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

కొత్తపల్లి, జూన్ 9 : జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయానికి రచయితలు పుస్తకాలు వితరణ చేశారు. వేములవాడకు చెందిన లాల లింగమూర్తి రచించిన 'మళ్లీ పెళ్లి కథలు' అనే 41 పుస్తకాలు, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు అన్నయ్య నూగుల రచించిన 'శబరిగిరి నివాస శతకం' పుస్తకాలను గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశ్‌కు సోమవారం అందించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సరిత, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మీ సేవ' నిర్వాహకుడిపై ఫిర్యాదు

కరీంనగర్ రూరల్, జూన్ 9: చామనపల్లి గ్రామంలోని మీ సేవ కేంద్రంలో సేవలు సక్రమంగా అందడం లేదని, నిర్వాహకుడు అందుబాటులో ఉండడం లేదని పలువురు గ్రామస్తులు సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే మీ సేవ కేంద్రం నిర్వాహణ బాధ్యతలను మరొకరికి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, తహసీల్దార్ మీ సేవ నిర్వాహకుడి వివరణ తీసుకున్నారు. గ్రామంలో సేవలందించకుంటే మరొకరికి కేంద్రం బాధ్యతలు అప్పగిస్తామని హెచ్చరించారు.

టీఆర్టీఎఫ్ బడిబాట ర్యాలీ

కమాన్‌చౌరస్తా, జూన్ 9: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్టీఎఫ్) కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీ నిర్వహించారు. టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాజా మంజూర్ అలీ, చింతపల్లి అశోక్ రావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ హాజరై ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా సర్కారు పాఠశాలల్లో విద్యనందిస్తున్నదని, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని పిలుపునిచ్చారు. బైక్ ర్యాలీ ఓల్డ్ స్కూల్ నుంచి బస్టాండ్, కెప్టెన్ రఘునందన్ చౌరస్తా, గీతా భవన్ చౌరస్తా మీదుగా సాగింది. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ సుంకిశాల ప్రభాకర్ రావు, నాయకులు 100 బైక్ లతో ర్యాలీలో పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

కమాన్‌చౌరస్తా, జూన్ 9 : బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న హుస్నాబాద్‌కు చెందిన పిట్టల సుష్మితకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్‌లోని టెక్ జీనీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా ల్యాప్‌టాప్‌ను అందజేశారు. సుష్మిత బీటెక్ చదువుతుండగా, ఆమె చదువు కోసం ల్యాప్‌టాప్ అవసరం ఉన్నదని తెలుసుకున్న సంస్థ సీఈవో శ్యాంసుందర్ సోమవారం ఐటీ టవర్‌లో రూ. 25 వేల విలువ చేసే లాప్‌టాప్‌ను సంస్థ డైరెక్టర్ సాయిరాజ్‌తో కలిసి అందజేశారు.

వివాహిత బలవన్మరణం

చొప్పదండి, జూన్ 9: చాకుంట గ్రామానికి చెందిన ఎడ్ల తేజసాయిశ్రీ (30) గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నది. ఎస్ఐ నరేశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎడ్ల తేజసాయిశ్రీ భర్త జగన్ గురువారం రాత్రి ఇంటికి రాలేదని శుక్రవారం అతడితో గొడవ పడింది. క్షణికావేశంలో గడ్డిమందు తాగింది. ఈ విషయాన్ని ఆమె కరీంనగర్‌లో ఉన్న తన చిన్నమ్మకు ఫోన్ చేసి చెప్పగా, బంధువులు 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించగా, తేజసాయిశ్రీ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. ఆమెకు కూతురు, కొడుకు ఉన్నారు. తేజసాయిశ్రీ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- అర్హత ఉన్నా ఇందిరమ్మ ఇండ్లు రాలేదని అర్జీదారుల గోడు
- అధికారులను పిలిచి విచారించాలని కలెక్టర్ ఆదేశాలు

కలెక్టరేట్, జూన్ 9: ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కోసం లబ్ధిదారుల ఎంపికకు నియమించిన కమిటీలు చేస్తున్న నిర్వాకం ప్రజావాణిలో కొట్టొచ్చినట్లు కనిపించింది. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అర్హులై ఉండి కూడా ఇండ్లు పొందలేని వారంతా తరలివచ్చారు. ముందుగా కలెక్టరేట్ ప్రధానద్వారం ఎదుట ఆందోళన చేపట్టి, అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి ఇందిరమ్మ కమిటీలు చేసిన ఎంపికతో తమకు జరిగిన అన్యాయంపై గోడు వెళ్లబోసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు మాకెందుకు రాలేదో చెప్పాలంటూ పట్టుబట్టారు. వారి అర్జీలు స్వీకరించి వెంటనే సంబంధితాధికారులను పిలిచి విచారించాలంటూ ఆదేశించారు. రైతులు, నిరుపేదల పట్ల రెవెన్యూ యంత్రాంగం అనుసరిస్తున్న తీరుపై కూడా పదుల సంఖ్యలో ఫిర్యాదులు రాగా, వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలంటూ ఆయా మండలాల రెవెన్యూ అధికారులకు అందజేశారు. వివిధ సమస్యలపై తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ జిల్లావ్యాప్తంగా 304 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్‌డీవో మహేశ్వర్, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్ ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతించాలి

నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటి స్థలం గుండి గ్రామంలో ఉండగా, ఆధార్‌కార్డు, ఓటరు ఐడీ కార్డులు మాత్రం గోపాల్‌రావుపేట గ్రామ నివాసం పేర ఉన్నాయి. మండల అధికారులను అడిగితే ఇందిరమ్మ కమిటీ అనుమతించాలని పేర్కొంటున్నారు. గుండి గ్రామంలో ఇల్లు నిర్మించుకునేందుకు ఇందిరమ్మ కమిటీ అనుమతించడం లేదు. వచ్చిన ఇల్లు రద్దయ్యేట్టు ఉన్నది. మాది నిరుపేద కుటుంబం. కూలి పనులు చేస్తేనే కుటుంబం గడుస్తున్నది. కలెక్టర్ మేడమైనా మాపై కనికరించి, ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతించేలా ఆదేశించాలని.

- వాన్‌కార్ లావణ్య, గోపాల్‌రావుపేట, రామడుగు

ఫిర్యాదు చేసినా పట్టించుకుంటలేరు

మా గ్రామంలో నా భార్య పేర ఉన్న భూమిని నాకు తెలువకుండా మాగ్రామానికి చెందిన బుర్ర లక్ష్మయ్య రెవెన్యూ అధికారుల వద్ద తనకున్న పలుకుబడితో ఆయన పేర పట్టా చేసుకున్నడు. సర్వేనం.655లో పదకొండున్నర గుంటల భూమితో పాటు 637 సర్వే నంబర్‌లో నాపేరుపై ఉన్న నాలుగెకరాల పద్దెనిమిది గుంటల భూమి కూడా తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నడు. అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదు. కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని కోరినా పట్టించుకోవడం లేదు. కలెక్టర్ మేడంకు ఫిర్యాదు చేస్తే అధికారుల్లో చలనం వస్తుందనే భావనతో ప్రజావాణికి వచ్చిన.

- ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, చెంజర్ల, మానకొండూర్

ఆస్తి లాక్కొని ఇంట్ల నుంచి వెళ్లగొట్టారు

నాబిడ్డ భూమాడి లలిత, అల్లుడు మల్లారెడ్డి నగరంలోని కొత్తయాస్వాడలో నాకున్న ఇల్లు, స్థలాన్ని లాక్కున్నారు. నన్ను ఇంట్ల నుంచి వెళ్లగొట్టారు. నాభర్త చనిపోయి 25 ఏళ్లు అవుతున్నది. నాలుగేళ్ల నుంచి నేను వేరేచోట కిరాయికి ఉంటున్న. నాకొచ్చే వృద్ధాప్య పెన్షన్ రూ.2వేలతోనే కాలం గడుపుతున్న. కంటి చూపు సరిగ్గా లేకపోవడంతో నేను అనేక ఇబ్బందులు పడుతున్న. దవాఖానకు వెళ్లాలంటే డబ్బులు లేవు. నా కుమార్తె, అల్లుడిపై చర్యలు తీసుకుని, నన్ను ఆదుకోవాలి.

- చల్ల వెంకటమ్మ, కొత్త యాస్వాడ, కరీంనగర్

రైతు ఆత్మహత్యాయత్నం

కరీంనగర్ రూరల్, జూన్ 9: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో సోమవారం కూర శ్రీనివాస్ రెడ్డి (40) అనే రైతు అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. కూర శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయం చేసుకుంటు, హార్వెస్టర్ నడిపిస్తున్నాడు. నెల రోజుల క్రితం అకస్మాత్తుగా కిందపడడంతో అనారోగ్యానికి గురయ్యాడు. ఆపరేషన్ కోసం రూ. 2 లక్షలు అవసరం కాగా, భూమిని విక్రయించేందుకు సిద్ధపడ్డా వీలుకాలేదు. ఈ క్రమంలో సోమవారం శ్రీనివాస్ రెడ్డి గడ్డిమందు తాగగా, కుటుంబ సభ్యులు గమనించి జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకువెళ్లారు. వరంగల్‌లో వైద్యులు చికిత్స చేస్తున్నారని స్థానికులు తెలిపారు.

అంధకారంలో దుర్గేడ్

3వ డివిజన్ దుర్గేడ్‌లో వీధి దీపాలు వెలుగకపోవడంతో రాజీవ్ రహదారిపై కమ్ముకొన్న చీకటి

కరీంనగర్ రూరల్, జూన్ 9: కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం తర్వాత దుర్గేడ్ గ్రామం పరిస్థితి అధ్వానంగా మారింది. 3వ డివిజన్‌గా మారిన దుర్గేడ్‌లో వీధి దీపాలు వెలుగక, అంధకారంగా అలుముకున్నది. రాజీవ్ రహదారి హైవేపై, గ్రామంలోని వీధుల్లో రాత్రి వేళల్లో చిమ్మచీకట్లు కమ్ముకుంటుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్, తదితరులు

విద్యానగర్, జూన్ 9: రాష్ట్రంలోని 33 జిల్లాలు, 12 వేల గ్రామాల్లో ఈనెల చివరి వారంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ తెలిపారు. సోమవారం కరీంనగర్‌లో అపెక్స్ కౌన్సిల్ గౌరవ చైర్మన్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి మున్నూరు కాపు రాష్ట్ర ఎన్నికల విధి విధానాలపై సమీక్షించారు. అనంతరం బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, మున్నూరు కాపులందరినీ సంఘటిత పరచి సంఘాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు, దాడి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద ఎన్ఎస్ఎస్ వలంటీర్‌కు అభినందనల వెల్లువ



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, తదితరులు

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూన్ 9: నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ గట్టు జీవా ఏంజెల్ ఇటీవల ఎనిపోయా యూనివర్సిటీ మంగుళూరు, కర్ణాటక రాష్ట్రంలో జరిగిన గ్లోబల్ యూత్ సమ్మిట్ – 2025లో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని కళాశాల నుంచి ఎన్ఎస్ఎస్ తరపున గ్లోబల్ సమ్మిట్‌కు తమ కళాశాల విద్యార్థి హాజరుకావడం గర్వకారణమన్నారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్ వి. ఆగంరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్, బైరం మహేశ్, ఏసీవో బి. సంపత్ కుమార్, ఏవో బి. శ్రవణ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు సైతం అభినందించారు.

రోటసిల్ వ్యాక్సిన్‌పై శిక్షణ

మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ

విద్యానగర్, జూన్ 9: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లకు సోమవారం డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ రోటసిల్ వ్యాక్సిన్ విధివిధానాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇంతకుముందు రోటా వైరస్ సింగిల్ డోస్ వయల్‌ను 6వారాలు 10 వారాలు 14 వారాల వ్యవధితో మూడు డోసులు ఇస్తుండగా, ఇప్పుడు కూడా రెండు డోసులు కలిగిన వయల్‌ను ఉపయోగించి కూడా ఇదే విధానంలో వ్యాక్సిన్ ఇవ్వాలని తెలిపారు. పిల్లల్లో తీవ్రమైన విరోచనాలు, వాంతులు కలగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాక్సిన్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాజిద, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లు, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో మాట్లాడుతున్న ఎంఈవో అంబటి వేణుకుమార్

కొనసాగుతున్న 'బడిబాట'

చిగురుమామిడి/శంకరపట్నం/రామడుగు/కరీంనగర్ రూరల్, జూన్ 9: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా విద్యావాహిని ప్రచార రథంతో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సోమవారం ప్రచారం నిర్వహించారు. చిగురుమామిడి మండలం సుందరగిరి, ఉల్లంపల్లి, కొండాపూర్, నవాబుపేట గ్రామాల్లో మండల విద్యాధికారి వీ పావని ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. శంకరపట్నం మండలం ఎరడపల్లి, తాడికల్, అంబాల్‌పూర్, ఇప్పలపల్లి, కరీంపేట్, కేశవపట్నం గ్రామాల్లో ఆయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు కూడలి సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు బోధిస్తారని, తల్లిదండ్రులు తమ పిల్లలను అక్కడే చదివించాలని ఎంఈవో లక్ష్మీనారాయణ కోరారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట, అనుబంధ గ్రామం కొల్లూరుపల్లి, తిర్మలాపూర్ గ్రామాల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ మాట్లాడుతూ, చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోరారు. కరీంనగర్ మండలం తీగలగుట్టపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కరుణ, ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. కరీంనగర్ మందులపల్లి గ్రామంలో మూతబడిన పాఠశాలను పునర్ ప్రారంభించేందుకు మండల విద్యాధికారి కే రవీందర్ పరిశీలించారు. పాఠశాల మూసివేతకు కారణాలు, గ్రామంలో చిన్నారుల సంఖ్య తదితర వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలను పునర్ ప్రారంభించేందుకు వారితో చర్చించారు.

ఉచిత వైద్య శిబిరం

వరుణ్ మోటార్స్ ఉద్యోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

విద్యానగర్, జూన్ 9: కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ బొమ్మకల్‌లోని వరుణ్ మోటార్స్ షోరూంలో సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని షోరూం మేనేజర్ సురేశ్, క్రాంతి, ప్రవీణ్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 120 మందికి డాక్టర్ సురేశ్ వైద్య పరీక్షలు చేశారు. గుండె వ్యాధులు, సాధారణ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ.. మెడికవర్ హాస్పిటల్‌లో 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ షోరూం ఉద్యోగులు, సిబ్బంది, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 287 దరఖాస్తులు

శంకరపట్నం/ కరీంనగర్ రూరల్, జూన్ 9: శంకరపట్నం మండలం కరీంపేట్, అంబాల్‌పూర్ గ్రామాల్లో సోమవారం రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంపేట్‌లో 40, అంబాల్‌పూర్‌లో 17 మంది రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు అందజేసినట్లు తహసీల్దార్ సురేఖ తెలిపారు. కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలో 230 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ రాజేశ్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 9: నగరంలో ఏబీ స్విచ్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1, 2 ఏడీఈలు పీ శ్రీనివాస్, లావణ్య వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 8నుంచి 10గంటల వరకు స్టేడియం ఏరియా, కట్టరాంపూర్, భగత్ నగర్, గౌతమీ నగర్, ఎల్ఐసీ ఆఫీసు ఏరియా, న్యూ శ్రీనగర్ కాలనీ, తిరుమల థియేటర్ ఏరియా, జట్కా మటన్ ఏరియా, ఒడిస్సా స్కూల్ ఏరియా, కమాన్ మెయిన్ రోడ్డు ప్రాంతాలు, ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అంబేద్కర్ నగర్ వాటర్ ట్యాంక్ ఏరియాకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

11న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ముగింపు

కొత్తపల్లి, జూన్ 9 : కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జిల్లా యువజన, క్రీడాశాఖ సహకారంతో నెల రోజులుగా అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఈనెల 11న ముగియనున్నట్లు డీవైఎస్‌వో వీ శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిక్షణలు విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. శిక్షకులు, విద్యార్థులు ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

30 వరకు రేషన్ సరుకుల పంపిణీ

కలెక్టరేట్, జూన్ 9 : జిల్లాలో ఈనెల 30 వరకు రేషన్ సరుకుల పంపిణీ చేయనున్నట్లు, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ తెలిపారు. మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం ఒకేసారి విడుదల చేయడంతో పంపిణీ ప్రక్రియలో ఆలస్యమవుతుండగా, ఈనెలాఖరు దాకా లబ్ధిదారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నెలా 15లోగా మాత్రమే డీలర్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తుండగా, వినియోగదారుల సౌలభ్యం కోసం ఈనెలాఖరు వరకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆహార భద్రత కార్డులకు ఒక్కొక్కయూనిట్‌కు నెలకు ఆరు కిలోల చొప్పున, అంత్యోదయ కార్డుదారులకు నెలకు 35 కిలోల చొప్పున, అన్నపూర్ణ కార్డుదారులకు నెలకు 10కిలోల చొప్పున బియ్యం పంపిణీ ఉంటుందన్నారు. అంత్యోదయ కార్డుదారులకు నెలకు కిలో చక్కెర చొప్పున, మూడు నెలలకు పంపిణీ చేస్తామని, కిలోకు రూ.13.50 మాత్రమే కార్డుదారులు చెల్లించాలని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ శిక్షణ

కరీంనగర్ రూరల్, జూన్ 9 : మండలంలోని నగునూర్, మొగ్దుంపూర్ గ్రామాల్లో సోమవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గుర్తించి అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష